# కథావేదిక

**మంచి కథల్ని మళ్ళీ మళ్ళీ చదువుకోవడం కోసం కథలన్నింటినీ ఒకే గుత్తిగా అందిస్తున్నాం.**

## మూగజీవులు



**రావి-ఎన్-అవధాని**

వైశాఖమాసపు ఎండ తీవ్రంగానే వుంది. సమయం పన్నెండు గంటలు కావస్తోంది. గౌరినాయుడి భార్య వెంకటలక్ష్మి మండువాలో పనివాళ్లచేత వడ్లు బాగు చేయిస్తోంది. ఇంతలో వీధిగుమ్మంలో 'దబ్బు'మన్న శబ్దం వినిపించింది. వెంకటలక్ష్మి చివాలున లేచి వీధిలోకి వచ్చింది. ఆమె వెంట పనివాళ్లు కూడ వచ్చేరు. సుమారు పన్నెండు ఏళ్ల వయస్సున్న కుర్రాడు గుమ్మంలో పడి వున్నాడు

''ఓలమ్మ! బొట్టెడు సొసొచ్చి పడిపోనాడు. బేగెల్లి నీల్లొట్టుకురండి'' అంది.

పనివాళ్లల్లో ఒకామె నీళ్లకోసం వెళ్లింది. మరో ఇద్దరు కుర్రాడిని వసారాలోకి తీసుకొని వచ్చేరు. ముఖం మీద నీళ్లు జల్లి తడిబట్టతో ముఖం కాళ్లా చేతులూ తుడిచేరు. కుర్రాడు కాస్త తేరుకొని కళ్లు తెరిచేడు. మంచినీళ్లు త్రాగి కృతజ్ఞతతో రెండు చేతులూ జోడించేడు.

కుర్రాడి రూపం పెద్దింటివారి అబ్బాయిలా వుంది. పసిమిఛాయ, చురుకైన కళ్లు, విశాలమైన నుదురు, నిక్కరు, బుష్ షర్ట్ వేసుకున్నాడు.

''ఎవురి బొట్టెడివి? నీ పేరేమిటి? ఈ వూరుగానట్టుందే? సుట్టరికానికొచ్చినావేటి? ఎవురింటిగొచ్చినావు?'' అంది వెంకటలక్ష్మి కుర్రాడి వీపుమీద చేయివేసి.

ఆమె ఆప్యాయతకు వాడు కంటతడి పెట్టుకొని ''ఆ ! ఆ !'' అంటూ చేతులతో సంజ్ఞ చేసేడు.

వాడి మూగభాష అర్థం చేసుకోడానికి వెంకటలక్ష్మికి చాలసేపు పట్టింది. వాడి పేరు 'సూరీడు' అని వాడు అనాథ అని తెల్సుకుంది.

''ఏటో ఈ గెహసారం! సక్కదనం ఇడినోరు కట్టేసినాడు దేవుడు. నువ్వు దిగులెట్టుకోక. నానున్నాను. మా ఇంటి కాడుండు. బువ్వెడతారా!'' అని వాడిని లోనికి తీసుకొని వెళ్లి, మండువా వసారాలో కూర్చోపెట్టి విస్తరాకు వేసి భోజనం పెట్టింది. వాడు కడుపు నిండా తిని ఆకు పారవేసి వచ్చేడు.

మధ్యాహ్నం ఇంటికి వచ్చిన భర్తకు సూరీడు గురించి చెప్పింది. గౌరినాయుడు వసారాలో కూర్చున్న సూరీడుని చూసేడు.

''సువ్వు సెప్పింది నిజవే. ఎవురో కలవారింటి బొట్టెడునాగే అవుపడతన్నాడు'' అన్నాడు.

''కూడు నేక తోటకూర కాడనాగ వాడలిపోనాడు'' మనింటికాడ వుండమన్నా'' అంది వెంకటలక్ష్మి జాలిగా.



## పేరేమిటి?

రెండోఆట సినిమా చూసి వస్తున్న వంశీని కానిస్టేబుల్ ఆపాడు.

‘‘ఎవరు నువ్వు? నీ పేరేమిటి?’’ అని అడిగాడు సీరియస్‌గా.

‘‘మ..మ..మరి నా పేరు వంశీ అండి’’ అన్నాడు భయంగా.

‘‘ఒరేయ్.. పిచ్చివేషాలెయ్యక. నీ పేరేమిటో మర్యాదగా చెప్పు. లేకపోతే నీ తోలు వలిచేస్తాను.’’ గద్దించాడు కానిస్టేబుల్.

‘‘సురేష్ అండి!’’ అన్నాడు తక్షణ.

‘‘అది.. అలా చెప్పు. ఇంత రాత్రిపూట రోడ్లమీద తిరక్కూడదు.. తెలిసిందా? వెళ్ళు’’ అన్నాడు కానిస్టేబుల్.

## కత్తి

‘‘నిన్న ఒకడు కత్తి చూపించి ఇరవై రూపాయలు అడిగాడు!’’

‘‘అప్పుడు నువ్వేం చేసావు?’’


‘‘ఇరవై రూపాయలిచ్చి ఆ కత్తిని కొనేసాను!’’

## ప్రశ్నలు

ఊరికే ప్రశ్నలు వేసి విసిగిస్తున్న కొడుకుని చూసి, ‘‘ఇన్ని ప్రశ్నలా అడిగేది? నేను నీలాగే నా చిన్నతనంలో ఇన్ని ప్రశ్నలు వేసుంటే ఏం జరిగేదో తెలుసా?’’ చికాకుగా అన్నాడు తండ్రి.

‘‘నా ప్రశ్నల్లో కొన్నిటికైనా సమాధానం చెప్పగలిగేవారు!’’ తక్షణ సమాధానం ఇచ్చాడు పుత్రరత్నం.

- పి.వి. మురళీకృష్ణ (హైదరాబాద్)




గౌరినాయుడు భార్య మాట కాదనలేదు.

‘‘ఈ సాపేసుకుని సాగిలబడు’’ అంటూ తాటాకుల చాప సూరీడుకిచ్చింది.

వాడు చాప వేసుకొని ఓ గంట నిద్రపోయి లేచేడు. వాడికి నీరసం తగ్గి కాస్తబలం వచ్చింది. పనివాళ్లు వడ్లు బాగుచేసి ఓ మూల పోగేసి భోజనాలకి వెళ్లేరు. సూరీడు వాటిని ప్రక్కనే వున్న ఖాళీ సంచులకు ఎత్తి అక్కడ శుభ్రం చేస్తున్నాడు. అటుగా వచ్చిన వెంకటలక్ష్మికి ఆ దృశ్యం కళ్లపడింది.

‘‘అల్లొత్తారు గదా! ఒగ్గేసేపోయేవా!’’ అని ‘ఎర్రినాగన్న సేతల పసందుకు సేసేగునం’ అనుకొని అబ్బురపడింది.

గౌరినాయుడికి విశాలమైన పెరడుంది. అందులో ఒక ప్రక్క పశువుల శాల దానిలో రెండు పాడి ఆవులు, దూడలు, రెండు జతల ఎడ్లు, వ్యవసాయ పరికరాలు వున్నాయి. ఆవరణలో పెద్ద గిలక బావి, రెండు కొబ్బరి చెట్లు, నాలుగు అంటు మామిడి చెట్లు, అరటి మొక్కలు, నందివర్ధనం మందార, వంగ, బెండ మొక్కలున్నాయి. ఇంకొకప్రక్క ఎండు వరిగడ్డి మేటుంది.

సూరీడు పెరట్లోకి వెళ్లి అంతా చూసేడు. గడ్డివాము నుంచి గడ్డి తీసి పశువులకు వేసి, కుడితి గోలేల నిండా నీరు నింపేడు. మొక్కలకు పాదులు చేసి నీళ్లు పోసేడు. కాళ్లూ, చేతులూ ముఖం కడుక్కొని లోనికి వచ్చేడు.

గౌరినాయుడు, వెంకటలక్ష్మి వాడి పనిని చూసి ఎంతో మెచ్చుకొన్నారు. ‘‘వాడు ఒళ్లు దాచుకునే రకం కాదని, అటువంటివాడిని చేరదీయటంవల్ల తమకు నష్టం లేదని’’ అనుకున్నారు. వెంకటలక్ష్మి భర్తతోపాటు వాడికీ చిక్కటి టీ ఇచ్చింది.

గౌరినాయుడికి పాతిక ఎకరాల పల్లం, నాలుగు ఎకరాల మెట్ట పొలం వుంది. గ్రామంలో మంచి పలుకుబడి వుంది. అన్నిటికన్నా మాట మంచితనం వున్న వ్యక్తి.

సూరీడు విషయం ఊర్లో అందరికీ తెల్సింది. ఎండ చల్లబడ్డాక పిల్లలూ పెద్దలూ వచ్చి వాడిని చూసేరు. పెద్దవాళ్లు వెంకటలక్ష్మితో కాస్సేపు మాట్లాడి వెళ్లేరు. ఈడు పిల్లలంతా వాడి చుట్టూ మూగేరు. కొందరు పిల్లలు పోకవుండలూ, పల్లీల వుండలూ, జంతికలూ, చక్కిలాలూ తెచ్చి వాడికిచ్చి నేస్తం కట్టేరు. వాడిని తమతో ఆటలకు పంపమని వెంకటలక్ష్మికి చెప్పేరు.

పొరుగింటి గంగమ్మ కొడుకు సింహాద్రి వాడికి కురచైనవి రెండు జతల బట్టలు తెచ్చి సూరీడుకిచ్చేడు.

మర్నాడుదయం సూరీడు వేకువనే లేచి పశువులకు కుడితులు పెట్టి పశువులశాల క్లీన్ చేసేడు. కొండవాగుకి వెళ్లి కాలకృత్యాలు తీర్చుకొని స్నానం చేసి పువ్వులు తీసుకొని గుడికి వెళ్లొచ్చేడు. వెంకటలక్ష్మి పెట్టిన చల్దికూడు తిన్నాడు. వూర్లో పశువులను గరువు మీదకు మేతకు తోలుకెళ్తున్నారు పశువుల కాపర్లు. గౌరినాయుడి పశువులకాపరి కాలు విరగడంవల్ల వాడు గత నాలుగు రోజులుగా పనికి రాలేదు. అందువల్ల పశువులు యింటివద్దనే వున్నాయి.

సూరీడు పశువులను మేపుకొస్తానని సంజ్ఞ చేసి చెప్పేడు.

వెంకటలక్ష్మికి వాడిని పశువుల కాపుకు పంపమనస్కరించలేదు.

‘‘వొద్దురా! అయి నిన్ను మెడ్డేత్తాయి. కొత్తోడివి కొమ్మిసుర్తాయి. ఆట్ని నొంగదీయనేవు’’ అంది. సూరీడు ప్రాధేయపడుతున్నాడు.

‘‘ఒగ్గీయే! ఆడూరికే సంబరపడతన్నాడు. దోలుకెల్లనీ! ఆటికి పికర్నేదు’’ అని భార్యను సమాధానపర్చి ‘‘దోలుకెల్లరా!’’ అన్నాడు గౌరినాయుడు.

సూరీడు కళ్లు ఆనందంతో మెరిసేయి. సొమ్ముల పలుపుతాళ్లు విప్పేడు. కాళీగొనె, కొడవలి తీసుకొని పశువులను గరువుమీదకు మేతకి తోలుకెళ్లేడు.

‘‘పొద్దుగూకేవొరకూ వుండబోక! మద్దేనం తిండి ఏలకి ఆటిని దోలుకొచ్చీ!’’ అని వాడికి పదేపదే చెప్పి పంపింది వెంకటలక్ష్మి.

సూదికొండవాడు అంచున పెరిగిన కొండగరిక కోసి సంచినిండా నింపేడు. పచ్చిక ఏపుగా వున్నచోట పశువులను తోలి అవి కడుపునిండా పచ్చగడ్డి మేసిన పిదప వాటిని తోలుకొచ్చేడు.

మూడోనాడు కొండగరిక కోస్తున్న సూరీడుకి కొండగొర్రెపిల్లకటి దట్టమైన పొదలో కనపడింది. వాడు దానిని మెల్లగా బయటకు తీసేడు. దానికి సుమారు రెండు నెలల వయస్సుంటుంది. ఏ జంతువో తరిమితే అది ఆ పొదలో పడి వుంటుంది.

పశువుల కాపరులందరూ వాడి చుట్టూ చేరేరు.

‘‘కొండగొర్రెపిల్లరేయ్! సూరీడుకి దొరికింది! సక్కగుంది అదురుట్టం! మావు యిన్నిదినాల దిరుగతన్నాం! మాకు దొరకనేదు! ఆరేయ్! అది పాలకోసం గోలెడతన్నాది సూడు!’’ అని ఒకడు ముంత నిండా మేకపాలు పిండి తెచ్చిచ్చేడు. సూరీడు దానికి కడుపు నిండా పాలు పట్టేడు. పశువులకాపర్లు వాడివెంటే వచ్చి వాడికది దొరికిన వైనం వెంకటలక్ష్మికి చెప్పేరు.

సూరీడుకి కొండగొర్రెపిల్ల దొరికిన విషయం వూరంతా తెల్సింది. పిల్లలంతా వచ్చి చూసేరు. చిన్న గంట తెచ్చి దానిమెడలో కట్టేరు.

సూరీడు కొద్దిరోజుల్లోనే వూర్లో అందరికీ అభిమాన పాత్రుడయ్యేడు. ఎవరు ఎప్పుడు ఏపని చెప్పినా

చేస్తాడు. వూర్లో ఎవరింట్లో ఏపిండి వంట చేసినా తొలుత సూరీడు చేతిలో పెట్టందే వారు ముట్టరు. వాడు రోజూ కొండకు వెళ్ళి ముళ్ళగోరింటపూలు కోసి తెచ్చి వూర్లో అందరికీ పంచుతాడు. పరింపళ్ళు, ఒక పళ్ళు, నేరేడుపళ్ళు తెచ్చి పిల్లకు పంచేవాడు. పచ్చివె దురుగొట్టాలతో పిల్లనగ్రోవి చేసి పిల్లలందరికీ ఇచ్చేడు.

వాడు పనిచేస్తున్నా వాడి వెనకాలే వాడి గొర్రెపిల్ల కూడా వుంటుంది. వాడు తినబోయే పదార్థం ముందుగా దాని నోటికందివ్వనిదే వాడు తినడు. వూర్లో పిల్లలకందరకూ గొర్రెపిల్లంటే అభిమానం. వారు రోజూ కాస్సేపు దానితో ఆడుకుంటున్నారు. అది కొన్నినెలలకు చక్కగా బలిసి గంభీరమైన పొట్టే లుగా ఎదిగింది. అది ఎంతో హుందాగా సూరీడు వెంట నడిచి వెళ్తుంటే దానిపై చూపులు మరల్చుకో లేరెవరూ.

''ముప్పొద్దులా దాన్నలా ఎంటేసుకు వూర్లదిరగ మోకరా! దిస్టి దగుల్తుంది. నరుడి కంట నాపరాయి పగుల్తాదిరా!'' అని రోజూ వాడిని హెచ్చరిస్తోంది వెంకటలక్ష్మి.

ఆవూరి ప్రెసిడెంటు పరశునాయుడు. అతను ఎంతో గర్విష్టి. తడిబట్టతో గొంతుక కోయగల నేర్పరి. అతని మాటకు ఎదురుచెప్తే సహించడు. పరశునాయుడి కన్ను సూరీడు పొట్టేలుపైపడింది. ఓరోజు అతను సూరీడుకి కబురు పంపేడు. వాడు పరశునాయుడింటికి చేరేసరికి అక్కడ గ్రామ పెద్ద లందరూ కూర్చొని వున్నారు.

''సూడొరేయ్! మా బొట్టికి కల్లేనం! రేపు నిచ్చి తార్థం. అందరికీ యిందు సెయ్యాల! అంసేత నీకా డున్న పొట్టేల్ని దోలుకొచ్చి మావోల్లకి వొప్పసెయ్యి! నాకు నీకట్టం యిడుకోను యింది!'' అని సూరీడు చేతిలో నాలుగు రూపాయి నాణేలుంచేడు పరశునా యుడు.

సూరీడు క్షణకాలం నివ్వెరబోయేడు. వాడికి పట్ట రాని కోపం వచ్చింది. చేతిలో వున్న డబ్బులు పరశు నాయుడి ముఖాన విసిరికొట్టేడు. దాంతో పరశునా యుడు చిందులు వేసి చేతికర్ర ఎత్తేడు వాడిని కొట్ట డానికి.

గ్రామ పెద్దలు, గౌరినాయుడు అతనిని వారిం చేరు. అక్కడ వున్నవారంతా సూరీడునే సమర్థించ టంతో పరశునాయుడు మౌనం వహించక తప్ప లేదు. అయితే గ్రామ పెద్దల ఎదుట జరిగిన అవ మానం మరువలేదు.

జరిగిన విషయం భర్త ద్వారా తెలుసుకొన్న వెంకట లక్ష్మి విలవిల లాడింది.

మరిడమ్మ వూరి గ్రామదేవత. ఎంతో చల్లని తల్లి అని గ్రామ వాసుల నమ్మిక. ప్రతియేడూ ఆ గ్రామ దేవత పండుగ వూరి ప్రజలంతా ఎంతో వైభవంగా జరిపిస్తున్నారు. మరిడమ్మ ఆలయ పూజారి గణా చారి ఏటా పూనకం వేసి దేవత పండుగ ఏరోజు జర పాలో ఎలా జరపాలో చెప్తాడు. అతను చెప్పిన విధం గానే గ్రామదేవత పండుగ జరిపిస్తున్నారు గ్రామవా సులు.

ఓరోజు గణాచారి పూనకం వేసేడు. వూరిజన మంతా అతని ముందు చేరేరు. గ్రామదేవతగా వూరి ప్రజలను, వారి పశుసంపదనూ పంటలనూ ఏవిధంగా కాపాడుతున్నారో వివరించి ఈయేడు పండుగ ఏరోజున ఎన్ని గంటలకు చెయ్యాలో చెప్పి ఈతడవ మూగోడి పొట్టేలుని నైవేద్యం పెట్టాలని, దానిని తనే వాడికి ప్రసాదించినట్లు పూనకంలో మరి డమ్మ శాసించింది.

మరిడమ్మ కోరికవిన్న గ్రామవాసులు నివ్వెరబో యేరు. ఆ చల్లని తల్లి ఏనాడూ జంతువులను కోర లేదు. గ్రామ ప్రజలంతా సూరీడుని వూరడించేరు. అయితే వాడు ఏవిధమైన దిగులూ చెందలేదు. ఎంతో నిబ్బరంగా వున్నాడు.

పండుగరోజు సాయంత్రం పొట్టేలు నుదుట పసు పూరాసి బొట్టుపెట్టి మెడలో వేపమండలు కట్టి గుడికి తీసుకొనివెళ్ళేరు.

సూరీడు కూడా దాని వెంట వెళ్ళేడు. మరిడమ్మ విగ్రహం ముందు దానిని నిలబెట్టి గణాచారి పూజా కార్యక్రమం ముగించి ధూపం వేసేడు. ప్రక్కనేవున్న వేటకత్తి అందుకోబోయేడు.

సూరీడు నిస్సహాయంగా పొట్టేలు కళ్ళల్లోకి చూసేడు. అది తన యజమానివైపు చూసింది. వాడి మూగవేదన నిస్సహాయతా దానికి అర్థమైంది. అంతే–

పొట్టేలు ఒక్క ఉదుటున గణాచారిని కుమ్మింది. వాడు ఎగిరి విగ్రహం కాళ్ళముందు బోర్లాపడ్డాడు. వెన్నెముక విరిగింది. దాంతో వాడు చేతులు జోడించి–


''రచ్చించుతల్లో! తప్పు కాయి! పెసిడెంటుగోరు నాసేత నాటకవాడించినారు. నాకేటీ తెల్దు! ఆరు సెప్పుమంది పూనకంల సెప్పినాను'' అంటూ బావు రుమన్నాడు గణాచారి.

పొట్టేలు అదేవూపున గిర్రున తిరిగి పరశునాయుడి డొక్కలో కుమ్మింది. వాడి ప్రక్క ఎముకలన్నీ నుగ్గ య్యాయి. మరొకమారు కుమ్మబోతే సూరీడు వారించి దానిని వెంటతీసుకొని ఎటో వెళ్ళిపో యేడు.

ఆ మూగజీవులు వెళ్ళినవైపే చూస్తూ గుడిముందు శిల విగ్రహాల్లా నిల్చుం డిపోయేరు గ్రామ ప్రజలు.

★

## తలమీద పుస్తకం విలువ



ఒకరోజున సుప్రసిద్ధ కన్నడ కవి, జ్ఞానపీఠ్ బహుమతి గ్రహీత కె.వి.పుట్టప్పను ఓ యువకుడు కలిసి, ''మీ రామా యణ దర్శనం పుస్తకం ఖరీదు చాలా ఎక్కువగా వుంది. దాని ఖరీదును యాభై రూపాయలుగా మీరు నిర్ణయించడం సముచితంగా లేదు'' అన్నాడు.

''నిజమే, ఆ పుస్తకం ఖరీదు ఎక్కువే'' అని అంగీక రించారు పుట్టప్ప. ఆయన ఆ యువకుడు ధరించిన బూట్ల వంక చూశారు. ''ఈ బూట్లు చాలా అందంగా వున్నాయి. వీటి ఖరీదెంత?'' అని అడి గారు.

ఆ యువకుడు గర్వంగా నవ్వి, ''వీటి ఖరీదు రెండు వందల రూపాయలు!'' అని చెప్పాడు.

''నువ్వు కేవలం నీ పాదాలను కప్పడం కోసం రెండు వందల రూపాయలు బూట్లకోసం ఖర్చుపెట్టావు. అయితే ఒక పవిత్రమైన మంచి పుస్తకం, తలమీద పెట్టుకొని సంచరించాలిగ్గే పుస్తకం ఖరీదు యాభై రూపాయలని దాన్ని కొనడానికి సందేహిస్తున్నావ్!'' అన్నారు గంభీరంగా పుట్టప్ప. ఆ యువకుడు సిగ్గుతో తల వంచుకొని అక్కణ్ణుంచి వెళ్ళాడు.

-కొడమల

## పర్వతాలెక్కే సాహసం!

ఇంద్రజిత్‌సింగ్ జైబి తన మోటారు సైకిల్ మీద హిమాలయాల మీదుగా వెళ్ళినవారిలో ప్రథముడు. 1976 సెప్టెంబర్‌లో జమ్ము నుండి బయలుదేరి 8600 కిలోమీటర్ల దూరాన్ని ప్రయాణం చేసేడు. కొండప్రాంతాలలో గల ఎత్తుపల్లాలను, మంచు కుప్ప లను లెక్కచేయకుండా మూడువందల కిలోమీటర్ల ప్రదేశాలలోగల ఎడారిని ధైర్యంగా దాటగలిగేడు. అలా ప్రయాణించి అక్టోబరు 1976లో అరుణాచలప్రదేశ్ లోగల రోహిత్ డివిజనును చేరగలిగేడు.

-యం.పద్మావతి

